క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

శంకరపట్నం: వంకాయగూడెం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. చింతగుట్ట గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోశారు. కార్యదర్శి నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు కోరెం రాజిరెడ్డి, రాజయ్య, సోనూ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేత

చిగురుమామిడి: మండలంలోని ప్రతి గ్రామంలో ముగ్గురు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నట్లు హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం చిగురుమామిడి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఇందుర్తి-హుస్నాబాద్ రోడ్డు ప్రారంభం

చిగురుమామిడి: ఇందుర్తి-హుస్నాబాద్, కొండాపూర్-హుస్నాబాద్ బీటీ రోడ్లను కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించనున్నారు. 2022లో రూ.24కోట్లు మంజూరు కాగా.. నిర్ణీత గడువులో పనులు పూర్తవడం విశేషం.

ఎంపీడీవోపై ఫిర్యాదు

చిగురుమామిడి: మండల పరిషత్ అధికారి మధుసూదన్‌పై సీపీఐ నాయకులు గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆమెకు రాతపూర్వకంగా పలు అంశాలను ప్రస్తావిస్తూ వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అర్హులైన వారిని కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలనే ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఇల్లు లేనివారిని ఎంపిక చేయకుండా అనర్హులను ఎంపిక చేశారని, కాంగ్రెస్ నాయకులకు ఎంపీడీవో వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. రాజీవ్ యువశక్తి పథకం కింద నిరుద్యోగులకు చెందాల్సిన పథకాలు కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారినే ఎంపిక చేశారని వాపోయారు. విచారణ చేయాలని సీపీఐ నాయకులు నాగేలి లక్ష్మారెడ్డి, సదాశివ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: ఎలగందుల కస్తూరిగాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ)లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి తుమ్మ ఆనందం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్‌కు పదోతరగతి, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి అర్హత కలిగి స్థానిక మండలానికి చెందిన మహిళా అభ్యర్థులై ఉండటంతో పాటు ఎక్కువ మందికి వంట చేసిన అనుభవం, ప్రాధాన్యంగా ఎండీఎం నందు పనిచేసిన అదనపు అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 9న సాయంత్రం 5 గంటల్లోగా కొత్తపల్లి జెడ్పీ పాఠశాల ఆవరణలోని ఎమ్మార్సీ భవనంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఉద్యోగం వచ్చిన అభ్యర్థులకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నెలకు రూ.9,750 చెల్లించడం జరుగుతుందని ఎంఈవో పేర్కొన్నారు.

బెస్ట్ అవెలబుల్ స్కూళ్లలో ఎస్టీ విద్యార్థులకు సీట్లు కేటాయింపు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 2025-26 సంవత్సరానికి బెస్ట్ అవెలబుల్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు ప్రవేశం కోసం కొత్తగా 5 సీట్లను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కేటాయించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వతరగతిలో లంబాడ బాలురకు 1, బాలికలకు 1, 5వ తరగతిలో ఎరుకల బాలురకు 1, బాలికలకు 1, 8వ తరగతిలో లంబాడ బాలికలకు 1 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు, రూరల్ ఏరియాలోని వారికి రూ.1.50లక్షలు ఉండాలని తెలిపారు. 3, 5, 8వ తరగతిలో ప్రవేశానికి ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఈనెల 9నుంచి 17వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కరీంనగర్ కార్యాలయంలో సమర్పించాలని, 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీఐ నాయకులు

కరీంనగర్: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పంజాల శ్రీనివాస్‌లు గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేశారు. పంజాల శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే చురుకైన వాడని, విద్యార్థి, యువజన రంగాల్లో పనిచేసి పార్టీలో జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగాడని చాడ వెంకటరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులను కలిసినప్పుడు స్పందించాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శంకరపట్నం: కన్నాపూర్ గ్రామంలో గురువారం మడేలేశ్వరస్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. రజక సంఘం నాయకులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

బైపాస్ రోడ్డుతో తప్పిన తిప్పలు

- పల్లె వెలుగు ఎరగని అంబాల్‌పూర్‌కు మహర్దశ


అంబాల్‌పూర్‌లో బైపాస్ జాతీయ రహదారి

శంకరపట్నం: అంబాల్‌పూర్-కేశవపట్నం రహదారిపై వర్షాకాలంలో గ్రామస్తులు బురద రోడ్డుపై వెళ్లేవారు. మండల కేంద్రానికి అంబాల్‌పూర్ గ్రామం నుంచి 2 కిలోమీటర్ల దూరం కాగా.. అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, తిమ్మాపూర్ మండలం మొగిళిపాలెం, చిగురుమామిడి మండలం రేకొండ గ్రామాల ప్రజలు ఈ దారి గుండా ప్రయాణిస్తారు. వానాకాలంలో బురద రోడ్డుపై ఇబ్బందులున్నప్పుడు తాడికల్, వంకాయగూడెం గ్రామాల నుంచి కేశవపట్నం రావాల్సి ఉండేది. ఈ రోడ్డుపై అదనంగా 6 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. సుమారు మూడు దశాబ్దాలుగా అంబాల్‌పూర్ గ్రామానికి పల్లె వెలుగు బస్సు కూడా రాని దుస్థితి ఉండేది. ఈ గ్రామం మీదుగా ఎన్‌హెచ్ఏ(563) బైపాస్ రోడ్డు మంజూరు కావడంతోపాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. నిత్యం మండల కేంద్రమైన కేశవపట్నం బైపాస్ రోడ్డుపై ప్రయాణిస్తున్నారు.

తిప్పలు తప్పినయ్



వానాలు పడితే రోడ్డుపై వర్షం నీరు నిలిచి బురద రోడ్డుగా ఉండేది. మట్టి రోడ్డుపై ఎక్కువ వరద వస్తే కోతకు గురై గండ్లు పడేది. వాహనాలపై వెళ్తే గుంతల్లో పడేటోళ్లం. మా ఊరు మీద నుంచి కరీంనగర్-వరంగల్ జాతీయ రోడ్డు బైపాస్ నిర్మించడంతో వాహనాలపై 2 నిమిషాల్లో కేశవపట్నం వెళ్తున్నం.

– నరేశ్, అంబాల్‌పూర్

సంతోషంగా ఉంది



కేశవపట్నం ప్రభుత్వ కార్యాలయాలకు మట్టి రోడ్డుపై పోయేటోళ్లం. ఇప్పుడు బైపాస్ రోడ్డు నిర్మించడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రి, ఎరువుల దుకాణానికి మోటార్ సైకిళ్లపై పోతున్నం. అదనపు తిరుగుడు తప్పింది. వాహనాలు కనిపించని మా ఊర్లో ఇప్పుడు వందల కొద్ది వెళ్తున్నాయి. సంతోషంగా ఉంది. బైపాస్‌పై కరీంనగర్, వరంగల్ వెళ్తాం.

– జలపతిరెడ్డి, అంబాల్‌పూర్



గంగాధర: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తాలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రోడ్డుకిరువైపులా మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాత్కాలికంగా కాలువలు తీసైనా మురుగు నీరు వెళ్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అనిల్, పంచాయతీ కార్యదర్శి, మధురానగర్, సెల్ నం.: 9959188196

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి


జమ్మికుంట: మెప్మా సభ్యులకు మొక్కలు అందజేసిన మున్సిపల్ అధికారులు

జమ్మికుంట: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి మెప్మా సంఘ సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. ఏఈలు నరేశ్, వికాస్, టీపీబీవో దీపిక, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, శ్రీకాంత్, వార్డు ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు, హరితహారం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.రమేశ్ ఆధ్వర్యంలో ప్రకృతి పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల ఎన్‌సీసీ అధికారి మ్యాకమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.
శంకరపట్నం: వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో భరతమాతకు ఒక్క మొక్క, తెలంగాణ తల్లికి ఒక మొక్కను విద్యార్థులతో హెచ్ఎం కోటేశ్వర్‌రావు నాటించారు.
మానకొండూర్: అన్నారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు నలుమాసు సుదర్శనం కరపత్రాలను ప్రజలకు అందజేశారు. మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, ఉపాధ్యాయురాలు కొండ శైలజ, సమ్మయ్య, సంపత్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.
కరీంనగర్ టౌన్: మాకే నామ్ సే ఏక్ పేడ్ లాగావో.. అమ్మ పేరుతో ఒక మొక్క.. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపుమేరకు ఈనెల 5 నుంచి ఆగస్టు 15 వరకు ప్రతీ ఒక్కరు తమ మాతృమూర్తి పేరిట ఒక్కమొక్క నాటి, దాన్ని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ కర్ణాటక శాసనసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఏళ్ల మోదీ ప్రభుత్వం-సంకల్పంతో సాకారం పేరిట చేపట్టే వివిధ కార్యక్రమాల కోసం నిర్వహించిన జిల్లా కార్యశాల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మూగ జయ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.
గంగాధర: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో దమ్మని రాము సూచించారు. మధురానగర్ గ్రామ పంచాయతీలో మొక్కలు నాటారు. ఎంపీవో గౌరి రమేశ్, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఏపీవో సత్యప్రకాశ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు తొలగింపు

సాక్షి స్పందన



జమ్మికుంట: జమ్మికుంట-కోరపల్లి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని గురువారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ ఆనంద్, అధికారులు, విద్యుత్ సిబ్బంది మొక్కలను తొలగించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

కరీంనగర్/కరీంనగర్ అర్బన్: ఆధునిక కాలంలో కంప్యూటర్ వినియోగం అత్యవసరమైందని, విద్యార్థులు కంప్యూటర్‌పై పట్టు పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్‌లోని చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఫొటోషాప్‌పై నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా గురువారం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫోన్‌కు దూరం ఉండి పుస్తకాలకు దగ్గర ఉండాలని సూచించారు. చదువు, క్రమశిక్షణను నమ్ముకుంటే ఉన్నత స్థానాలకు ఎదుగుతామని, సమాజంలో గౌరవం వస్తుందన్నారు. హోంవర్క్‌గా ఒక పేజీ టైప్ చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా విద్యా నియంత్రణ అధికారి అశోక్‌రెడ్డి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ వెంకట రాంబాబు, ప్రోగ్రాం ట్రైనర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' భావోద్వేగానికి రూపం

కరీంనగర్ టౌన్: ఆపరేషన్ సిందూర్ అనే పేరుకున్న అర్థం అత్యంత భావోద్వేగపూరితమైనదని, ఈ పేరును ఎంపిక చేయడంలో భారత ప్రభుత్వం చూపిన సామాజిక స్పర్శ, మానవీయ దృక్పథం, న్యాయంపై ఉన్న నిబద్ధత స్పష్టంగా కనిపిస్తాయని టీవీ విశ్లేషకుడు, చార్టెడ్ అకౌంటెంట్ గిరిధర్ మామిడి అన్నారు. వైశ్యభవన్‌లో ప్రజ్ఞాభారతి, వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సిందూర్ అంటే భారత సంప్రదాయంలో ఒక మహిళ భర్త బతికి ఉన్న ప్రతీకకు నిదర్శనం లాంటిదని, అది ఆమె గౌరవానికి, భద్రతకు, భార్యగా ఉన్న స్థానానికి చిహ్నంగా వ్యవహరించబడుతుందని అన్నారు. ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు రాజాభాస్కర్‌రెడ్డి, సీఏ నిరంజనా చారి, కార్యదర్శి నగేశ్‌రెడ్డి, వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైతుల దరఖాస్తులను పరిశీలించాలి


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్: భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన భూమి దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. చెంజర్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ విజయ్, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
రామడుగు: ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న సదస్సులను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సూచించారు. చిప్పకుర్తి, శ్రీరాములపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. శ్రీరాములపల్లి సదస్సులో అదనపు కలెక్టర్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.
గంగాధర: న్యాలకొండాయిపల్లి, కురిక్యాల గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూభారతి సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ అనుపమరావు రైతుల నుంచి భూములకు సంబంధించిన సమస్యలనడిగి తెలుసుకొని దరఖాస్తులు స్వీకరించారు.
చిగురుమామిడి: రైతులు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేశ్ కోరారు. ఇందుర్తిలో భూభారతి గ్రామసభ నిర్వహించారు. 277 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నాయబ్ తహసీల్దార్ స్వరూపరాణి, ఆర్ఐలు అరుణ్‌కుమార్, తారదేవి పాల్గొన్నారు.
జమ్మికుంట: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం తనుగుల గ్రామంలో రెండో రోజు భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 123 దరఖాస్తులు వచ్చాయన్నారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


సమస్యలడిగి తెలుసుకుంటున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్: బుడుగజంగాలకాలనీలో గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను కాలనీవాసులనడిగి తెలుసుకున్నారు. కాలనీలో గతంలో నెలకొన్న సమస్యలను విడతల వారీగా పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

సాగులో సాంకేతికత జోడిస్తే ఉత్తమ ఫలితాలు

రామడుగు: రైతులు కాలానుగుణంగా సాగులో నూతన సాంకేతికతను జోడించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేస్తే ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశముంటుందని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంపన్న రైతు దేశానికి గర్వకారణం కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు కృష్ణవేణి, బ్రజేంద్ర రైతులకు వరి రకాలపై వివరించి, మట్టి పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతులకు మొక్కలు అందజేయడంతోపాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్.వెంకటేశ్వర్‌రావు, జి.వేణుగోపాల్, ఉద్యానవన శాస్త్రవేత్త డి.శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి త్రివేదిక, పుష్పాంజలి, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులు బలోపేతం

మానకొండూర్: కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలోనే ప్రభుత్వ బడులు బలోపేతమయ్యాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ తాళ్లపల్లి సంపత్‌గౌడ్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన బడిబాట ప్రచారంలో పాల్గొని మాట్లాడారు.

సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు విరాళం

జమ్మికుంట: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల తరగతి గదుల కోసం భారీ విరాళాన్ని గురువారం అందజేసి ఉదారత చాటుకున్నారు. పట్టణంలోని ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు, విద్యారణ్య ఆవాస విద్యాలయం జమ్మికుంట సమితి అధ్యక్షుడు డా.చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.2.50లక్షల చెక్కును గురువారం ప్రబంధకారిణి సభ్యులకు అందజేశారు.

మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

మానకొండూర్: త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్(ధర్మపురి), తోట లక్ష్మీకాంతరావు(జుక్కల్), కాలె యాదయ్య (చేవెళ్ల) ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను వేరువేరుగా కలిసి గురువారం వినతిపత్రాలు సమర్పించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

శంకరపట్నం: కరీంపేట గ్రామంలో గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై హుజూరాబాద్ ఏసీపీ మాధవి విచారణ చేశారు. కరీంపేట గ్రామానికి చెందిన తల్లి, కొడుకు గడ్డం మల్లవ్వ, రాజు కలిసి రాజు భార్య స్వప్నను మే 22న రాత్రి కొడుతుండగా.. ఎస్సీకాలనీకి చెందిన సామాజికవర్గానికి చెందిన కొందరు ఎందుకు కొడుతున్నారని అడగడంతో కులం పేరుతో దూషించారని మే 24న మేరుగు శ్రీనివాస్ కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు తల్లి, కొడుకుపై నమోదు కాగా.. హుజూరాబాద్ ఏసీపీ మాధవి గ్రామంలో ఫిర్యాదుదారుడు, సాక్షులను విచారించారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం: గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు న్యాలపట్ల పర్శరాములుగౌడ్(80) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. పర్శరాములు వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండలేక ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి కోడలు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు..

జమ్మికుంట: ఉపాధి దొరకక మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత సిటికేబుల్ లైన్‌లో ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్న బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లా రసూల్‌పుర గ్రామానికి చెందిన కామేశ్వర్‌కుమార్(20) అనే యువకుడు ఉపాధి కోసం జమ్మికుంట పట్టణంలో ఉంటున్నాడు. కొంతకాలంగా పని దొరకడం లేదు. జీవనోపాధి దొరకడం లేదని, ఆర్థిక ఇబ్బందులకు గురై గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడట్లు సమీప బంధువులు గుర్తించారు. బంధువు అరుణ్‌ప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎనిమిది మంది ఎస్సైల బదిలీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లోని ఎనిమిది మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గన్నేరువరం ఎస్సైగా వీఆర్‌లో ఉన్న జి.నరేందర్‌రెడ్డిని, ఇల్లంతకుంట ఎస్సైగా ఉన్న కె.శ్రీకాంత్‌ఎల్ఎండీ కాలనీకి, సీసీఆర్‌బీ ఎస్సైగా ఉన్న ఎన్.నరేశ్‌రెడ్డిని చొప్పదండి ఎస్సైగా, కరీంనగర్ సీటీసీ ఎస్సైగా ఉన్న ఏ.తిరుపతిని వీణవంక ఎస్సైగా బదిలీ చేశారు. గన్నేరువరం ఎస్సైగా ఉన్న నరేశ్, ఎల్ఎండీ కాలనీ ఎస్సైగా ఉన్న వివేక్, చొప్పదండి ఎస్సైగా ఉన్న ఎం.సురేందర్, వీణవంక ఎస్సైగా ఉన్న టి.తిరుపతిలను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కంటి శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్‌కు..

హుజూరాబాద్: సింగాపూర్ గ్రామానికి చెందిన జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాల్లో కంటి శస్త్ర చికిత్సలకు గుర్తించిన వారిని గురువారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుడిపాటి సరిత జయపాల్‌రెడ్డి తెలిపారు.

ఏసీపీకి సన్మానం

హుజూరాబాద్: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి మాధవిని యునైటెడ్ ఫోరం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

22వ వార్డులో పారిశుధ్య పనులు

హుజూరాబాద్: పర్యావరణ అనుకూల నగరాల అభివృద్ధి-వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 22వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు జరిగాయి. వార్డులోని కాకతీయ కాలనీలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేశారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ సాంబరాజు, అసిస్టెంట్ ఇంజినీర్ సుధాకర్, జూనియర్ సహాయకులు తదితరులున్నారు.

స్వచ్ఛతా ర్యాలీ

చొప్పదండి: పట్టణంలో మహిళా సంఘాల సభ్యులు గురువారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు ర్యాలీని ప్రారంభించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కుడి చెరువు వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. సీఐ ప్రదీప్‌కుమార్, మేనేజర్ ప్రశాంత్‌కుమార్, చిల్ల శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్లు అందజేత

ఇల్లందకుంట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గురువారం రూరల్ సీఐ కిశోర్ బాధితులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసేడు గ్రామానికి చెందిన బీసు తిరుపతి, బాబు జానీ, ఏనుగుల క్రాంతి, జమ్మికుంటకు చెందిన బోల్ల రాజు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఇల్లందకుంట పోలీసులకు ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పోలీసులు టెక్నాలజీ ఆధారంగా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు.

రైతు భరోసా నిధులను జమ చేయాలి


ఇల్లందకుంట: రాబోయే వానాకాలం సీజన్‌కు రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు.

రక్తదాన శిబిరం


చొప్పదండి: పాల్గొన్న కార్యకర్తలు

చొప్పదండి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 38 మంది రక్తం అందించారు. ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కొమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం నీరజ, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, నిజానపురం చందు, కొట్టె అశోక్, మునిగాల సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
రామడుగు: మండల కేంద్రంలో, వెదిర బస్టాండ్ వద్ద గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వెలిచాల గ్రామంలోని స్పందన వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

విలువలతో కూడిన విద్యతోనే గుర్తింపు


విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న సీఐ

హుజూరాబాద్: విలువలతో కూడిన విద్యతోనే సమాజంలో ప్రతి మనిషికి గుర్తింపు లభిస్తుందని సీఐ కరుణాకర్ అన్నారు. పట్టణంలోని సిటీ సెంటర్ ఫంక్షన్ హాల్‌లో హుజూరాబాద్ ముస్లిం వెల్ఫేర్ ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ముస్లిం విద్యార్థులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎండీ గఫార్, ఎస్సై యూనస్ అహ్మద్ అలీ, కార్యదర్శి హాఫిజ్ అబ్దుల్ షాహీం, ఉపాధ్యక్షులు మొహమ్మద్ హబీబ్, ముఖ్య సలహాదారులు మహమ్మద్ అజ్మతుల్లాఖాన్, ఎండీ సలీం, అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.